www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 21 నవంబర్ 2023
5
చిత్తూరు



'స్పందన'కు 294 అర్జీలు



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 294 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 235, మండల లెవెల్ కో ఆర్డినేటర్ కమిటీ 2, జిల్లా ఉపాధికల్పన శాఖ 3, డిఎల్ఎస్ఏ 4, మండల ప్రజా పరిషత్ పెనుమూరు 1, పిఓ, సర్వశిక్ష అభియాన్1, ఎపిఎస్ పిడిసిఎల్ 2, డిసిహెచ్ఎస్ 1, డిఎస్ఓ 1, ఎల్‌డిఎం 1, ఆర్‌జెడి విద్యాశాఖ కడప జిల్లా 1, జిల్లా దేవాదాయ శాఖ 1, ఎస్‌డిసిహెచ్ ఎన్ఎస్ఎస్ మదనపల్లి 1, డెయిరీ డెవలప్‌మెంట్ 1, డిఎస్ఎల్ఓ 2, డిఆర్‌డిఏ 2, పోలీసుశాఖ 3, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ 1, ఏపిఎస్ఆర్‌టిసి 2, మండల ప్రజాపరిషత్ పలమనేరు 1, డ్వామా 1, ఎస్ఇపిఆర్ 1, ఎస్ఇ ఇరిగేషన్ 1, పెన్షన్, రేషన్ కార్డులు ఇతరులు 25 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు తమ వినతులను అందజేశారు. వివిధ శాఖలకు సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు : డీఎస్పీ



స్పందన కార్యక్రమంలో అర్జీల స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో 18 ఫిర్యాదులను స్వీకరించినట్లు చిత్తూరు పట్టణ డిఎస్పీ శ్రీనివాస మూర్తి తెలిపారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా పట్టణ డీఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ డీఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి తగాదాలు 2, చీటింగ్ 1, కుటుంబతగాదాలు 2, భర్త వేధింపులు 2, భూతగాదాలు 6, ఆస్తి తగాదాలు 5 ఉన్నాయి.

'స్పందన'కు నాలుగు వినతులు

చిత్తూరుఅర్బన్: స్థానిక నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ గోవర్ధన్ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్లానింగ్ విభాగం 3, ఇంజనీరింగ్ 1 చొప్పున మొత్తం నాలుగు వినతులు అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికలకు సంబంధించి సెక్టార్, సెక్టార్ పోలీస్ అధికారుల నియామకం వెంటనే చేయాలని వారికి శిక్షణ ఇప్పించాలని, నియోజకవర్గాలు జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి ఎన్నికలకు సంబంధించి ప్రక్రియ వేగంగా జరిగేటట్లు చూడాలని రాష్ట్ర ఎన్నికల అడిషనల్ కమిషనర్ హరేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్, సెక్టార్ పోలీస్ అధికారుల నియామకం పూర్తిచేసిన వెంటనే వారికి శిక్షణ ఇప్పించి క్షేత్రస్థాయిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, మొదటవారికి పోలింగ్ కేంద్రాల వారిగా గతంలో జరిగిన సంఘటనలకు సంబంధించి సమాచారం ఇచ్చి ప్రస్తుతపరిస్థితులను బేరీజు వేసుకునేలా క్షేత్రస్థాయిలో వారు ప్రతి పోలింగ్ కేంద్రం పరిశీలించాలని అన్నారు. అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారుల నునియమించాలన్నారు. జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయి నోడల్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్‌ను గుర్తించాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో ఉన్న నోడల్ అధికారులకు సహకరించేందుకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 సంవత్సరాలు పైబడి లేదా ప్రత్యేక ప్రతిభావంతులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ నిర్వహించే విధానంపై శిక్షణ అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఏపిక్ కార్డులకు సంబంధించి 20 వరకు ఉన్న వాటిని 23వ తేదీన ప్రింటింగ్‌కు పంపాలని, 21వ తేదీ నుంచి ప్రతి మంగళ, గురు వారాలలో ఏపిక్ జనరేషన్ చేయాలని, వారంలో ఒకసారి ఎన్నికల సంఘం నిర్ణయించిన రోజున ప్రింటింగ్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, ఎన్నికల సూపరింటెండెంట్ బ్యూలా పాల్గొన్నారు.

గర్భిణులను తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా తరలించాలి

డిఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ దేవి ప్రోగ్రాం అధికారులు, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాత శిశు ఆరోగ్యం, గర్భిణీ స్త్రీల నమోదు వారికి ఇచ్చేటటువంటి ఆరోగ్య సేవలు, హైరిస్కు గర్భిణీ స్త్రీలను తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ ద్వారా ఆసుపత్రికి పంపుట, రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలకు సుక్రోస్ ఇంజక్షన్లు ఇప్పించుట, అన్ని సేవలను ఆన్లైన్లో అప్లై, జగనన్న ఆరోగ్యశ్రీ రెఫెరల్ కేసులకు ఈనెలలో పూర్తి చికిత్సలు, ఆపరేషన్లు పూర్తి చేయించి ఫాలోఅప్, అలాగే ప్రధానమంత్రి మాత వందన యోజనకు సంబంధించిన అన్ని అప్లికేషన్స్ అప్లోడ్ చేయించి అర్హత కలిగిన వారందరికీ పారితోషకం అందేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిని ఎప్పటికప్పుడు అప్డేట్ చేయిస్తూ మానిటర్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పాల్గొన్నారు.


పంటలపై ఏనుగుల దాడులు



వికోటలో ఏనుగులు నాశనం చేసిన వరి పంట

ప్రజాశక్తి- వికోట: వికోట మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు బోయకొండప్పకు చెందిన రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున 15 ఏనుగులు గ్రామ చివారున ఉన్న వంటి పంటను తిన్నంత వరకు తిని తొక్కి ధ్వంసం చేశారు. దీని వలన సుమారు రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లిందని రైతును ఆవేదన వ్యక్తం చేశారు. కోత దశలో ఉన్న పంటను తొక్కి నేలమట్టం చేశాయని వాపోయారు.

రామకుప్పం: మండల పరిధిలోని ననియాల, నారాయణపురం తాండా గ్రామ అటవీ శివార్లలోని పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఆదివారం అర్ధరాత్రి కామరాజు నాయక్, రాఘవ నాయక్, గోవిందస్వామి నాయక్, శివ నాయక్‌లకు చెందిన వరి, రాగి, అరటి పంటలపై తిన్నంత తిని, తొక్కి నాశనం చేయడమే కాక వ్యవసాయ పరకాల కూడా ధ్వంసం చేశాయి. రైతులు రాత్రి సమయాల్లో పంటపొలాల వైపు వెళ్లేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు. అప్పులు చేసి వ్యవసాయ పంటలు చేస్తుంటే ఏనుగులు నాశనం చేయడంతో వేల రూపాయలతో నష్టం వాటిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు పంటలపై కి చొరబడకుండా శాశ్వతమైన నివారణ చర్యలు తీసుకోవాలని, తమకు నష్టపరిహారం అందివ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.



రామకుప్పంలో.

గజ దాడుల్లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి



ఏనుగుల దాడుల్లో భారీగా రైతులు నష్టపోతున్నారని, వారిని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలమనేరు, వికోట, రామకుప్పం, సోమల, సదుం, బైరెడ్డిపల్లి మండలాలు అటవీ సరిహద్దున ఉండటంతో తరచూ గ్రామాల్లోకి వచ్చి ఏనుగులు భీభత్సం సృష్టిస్తున్నాయన్నారు. ఏనుగులు పంటలపై దాడి చేసి కోతకొచ్చిన పంటలను నాశనం చేస్తున్నాయని, అప్పులు చేసి పండించిన పంటలను ఏనుగుల నాశనం చేయడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్లే పంట పొలాల్లోకి ఏనుగులు నిత్యం గ్రామాల్లోకి చొరబడుతున్నాయని, వాటిని అరికట్టడంలో సరైన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని విమర్శించారు. ఇప్పటి వరకు జిల్లాలోని రైతులకు నష్టపరిహారం అందిన దాఖలాలు లేవన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

డిసెంబర్ 8 నుంచి సమ్మె



సిడిపిఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించే ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని సోమవారం చిత్తూరు కొంగారెడ్డిపల్లిలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు, ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈసందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.నాగరాజు, అంగన్వాడీ యూనియన్ల జిల్లా కార్యదర్శులు షకీలా, ప్రేమ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అదేవిధంగా లక్షలాదిమంది లబ్ధిదారులకు బాలింతలకు నష్టం చేకూర్చే ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తీసుకురావడం దుర్మార్గమని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియుల ఆధ్వర్యంలో అంగన్వాడీలు మరో పోరాటానికి సిద్ధమయ్యారని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 23న జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, 25 నుంచి 28వ తేదీ వరకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, డిసెంబర్ ఒకటి నుంచి లబ్ధిదారులలో విస్తతమైన ప్రచారం, డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నామని ఈ కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటం చేసి అంగన్వాడీల సత్తా ఏంటో చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సుజని, కార్మిక నాయకులు రమాదేవి మనీ, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

సంఘమిత్రను వేధిస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన సంఘమిత్రలు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సంఘమిత్రలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

సోమల మండలం పెద్దవుప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లి-3 సంఘమిత్రను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని సోమవారం స్పందనలో సంఘసభ్యులు కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘమిత్ర యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, బాధిత సంఘమిత్ర మమతలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 16 సంఘాల సభ్యులు 160మంది సంఘమిత్ర మమత ఉండాలని తీర్మానం చేసినప్పటికీ ఏపిఎం వారి మనిషిని పెట్టుకోవడానికి ఉద్దేశపూర్వకంగానే వివో మినిట్స్‌లో తీర్మానం లేకుండా కొత్త సంఘమిత్ర నియమించడం దారుణమని విమర్శించారు. డిఆర్డిఏ నిబంధనలు తుంగలో తొక్కుతున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. ఇప్పటికే సంఘమిత్రను రకరకాలుగా మానసికంగా ఇబ్బందులకు గురిచేసి ఆమె ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడానికి కారణమైన ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని గతంలో కూడా కలెక్టరుకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆ సందర్భంగా డిఆర్డిఏ ఐబి వెంకటేశ్వర్లు వెళ్లి గ్రామంలో సమావేశం జరిపి సందర్భంగా కూడా సంఘ సభ్యులు అందరూ కూడా మమత ఉండాలని తీర్మానం చేయడం జరిగిదని, ఆ తీర్మానం ప్రకారం ఏపీఎం వ్యవహరించడం లేదని, గత ఆరు నెలలుగా పనిచేసిన రోజులకు కూడా జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుంటే జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరితో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఏపీఎం వివోలో తీర్మానం లేకుండా కొత్త వారికి ఎలా అవకాశం ఇస్తారని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వివో తీర్మానం ప్రకారం సంఘమిత్రను మమతను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో పక్కాగా పారిశుధ్యం: కమిషనర్



పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ ఎన్టీఆర్ బస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్, పాత కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయల మార్కెట్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. మార్కెట్లలో జనం తిరిగే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పలువురు దుకాణదారులతో స్వయంగా మాట్లాడారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయవద్దని, దుకాణాల వద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకొని అందులో వేయాలన్నారు. వీటిని పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని అవగాహన కల్పించారు. కమర్షియల్ ప్రాంతాల్లో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం అంశాలపై దుకాణదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ చేపల మార్కెట్లోని దుకాణాలను తనిఖీ చేశారు. నాణ్యమైన చేపలనే వినియోగదారులకు విక్రయించాలన్నారు. చేపలను విక్రయించే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేపల మార్కెట్ వద్ద రోజూ శుభ్రం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రిలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ మధుబాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారంతో ముగింపు సమావేశం ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. ముగింపు సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనారు మధుబాల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాలలో వివిధ రకాలైన పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారని, ఇదేవిధంగా ప్రతిరోజూ గ్రంథాలయంకు రావడం దినచర్యగా అలవాటు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యఅతిథిగా నగరపాలక మేయర్ అముద పాల్గొని మాట్లాడుతూ పుస్తకం మంచి నేస్తం కాబట్టి ప్రతి విద్యార్థి చక్కగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుండి తాను గ్రంథాలయంకు వెళ్లి వివిధ రకాలైన పుస్తకాలు చదవడం వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నాని తెలిపారు. పిసిఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ పుస్తక పఠనం, అభ్యాసం వలన విజ్ఞానంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయంలో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి శర్మ, ఇన్‌ఛార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, మధుబాబు, రాజ్‌కుమార్ గుణశేఖర్, బిలాల్ గ్రంథాలయ అధికారులు పూర్ణిమ, తులసి కుమార్, దేవీబాల, సరస్వతి, శిరీష, లవకుమార్, రాజశేఖర్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

మృతదేహంతో రహదారి దిగ్బంధం

అంత్యక్రియలకు స్థలం చూపించాలని తహశీల్దార్ కార్యాలయ ముట్టడి

శ్మశానవాటికలో ఆక్రమణదారుడు అడ్డుకోవడంతో నిరసన

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఆందోళన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: శ్మశాన వాటికలో మృతదేహాన్ని కననం చేయడానికి భూ ఆక్రమణదారుడు అడ్డుకోవడంతో గ్రామస్తులు సోమవారం మృతదేహంతో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మండలంలోని కమ్మనపల్లి గ్రామంలో ఉన్న శ్మశాన వాటికను ఆక్రమించుకొని దౌర్జన్యంతో కననం చేయనీయడం లేదంటూ ఆ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అక్కడి అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మృతదేహాన్ని బైరెడ్డిపల్లి-పుంగనూరు రహదారి వద్దకు తరలించి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యపై గ్రామస్తులతో చర్చించారు. శ్మశాన స్థలంలో మృతదేహాన్ని కననం చేసేందుకు అనుమతిస్తేనే కదులుతామని కరాకండిగా చెప్పడంతో పోలీసులు రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఎట్టకేలకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం శ్మశాన వాటిక స్థలంలో మృతదేహాన్ని కననం చేసేందుకు ఆక్రమణదారుడిని ఒప్పించారు. దీంతో సమస్య సద్దుమనిగింది.

శ్మశానం కబ్జా చేసింది అక్కడి వీఆర్ఏనే.!

శ్మశాన స్థలంలపై అక్కడి పెద్దలను ఆరాదీయగా తాత హయాం నుంచి బిసి కులస్తులకు శ్మశాన వాటిక ఉందన్నారు. అయితే గతంలో వీఆర్ఏగా పని చేస్తున్న వెంకటేష్ ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారని 2021 నుంచి గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కాగా సర్వే చేసి సరిహద్దులు చూపించారు. అయినప్పటికీ సరిహద్దురాళ్లను ఆక్రమణదారులు తొలగించారని వారు చెబుతున్న మాట. ఈ విషయంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన వాటిక స్థల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై టీటీడీ ఈవో సమీక్ష



ప్రజాశక్తి- తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా డిసెంబర్ 23 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు పది రోజులపాటు భక్తులకు కల్పించనున్న వైకుంఠ ద్వారదర్శన ఏర్పాట్లపై టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల్లో సిబ్బంది అప్రమత్తంగా పనిచేసేలా అధికారులు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. నిఘా, భద్రత అధికారులు పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాలతో పాటు, తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్న సర్వదర్శనం కౌంటర్ల వద్ద భద్రత, భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చంటి పిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బందికి ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు మినహా ఇతరుల నుండి ఈ పది రోజులపాటు వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని వెల్లడించారు. భక్తులు క్యూ లైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండడాన్ని నివారించేందుకు భక్తులకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నామని తెలియజేశారు. ఇందులో భాగంగా 2.25 లక్షల రూ.300లు ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు నవంబరు 10న విడుదల చేశామన్నారు. తిరుపతిలోని సర్వదర్శనం కౌంటర్లలో డిసెంబరు 22 నుండి మొత్తం 4,23,500 టోకెన్లు మంజూరు చేస్తామని తెలిపారు. భక్తుల కోసం రోజుకు 7 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఉదయం 6 నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు అన్నప్రసాదాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కల్యాణకట్టల్లో తగినంతమంది క్షురకులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శ్రీవారి ఆలయం, ఇతర ప్రాంతాల్లో ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేపట్టాలన్నారు. భక్తులకు సేవలందించేందుకు తగినంతమంది శ్రీవారిసేవకులను ఆహ్వానించాలని సూచించారు. సమీక్షలో టీటీడీ జెఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల రక్తదానం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలోని వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సి, వైఆర్‌సి, ఐక్యూఎసి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో తిరుపతి ఎన్‌టిఆర్ ట్రస్ట్ వారు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 30మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల సిబ్బంది రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మంగళగౌరి, తిరుపతి ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఇంచార్జ్ రవి, టెక్నీషియన్ భద్ర, జ్ఞానేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు బ్యాటరీ వితరణ



ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జెడ్పి ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి దినేష్ పాఠశాలకు విరాళంగా బ్యాటరీని అందజేశారు. సోమవారం హెచ్‌ఎం సోమశేఖర్‌కు ఇన్వర్టర్, బ్యాటరీని దాత తండ్రి సుబ్రమణ్యం అందించారు. పూర్వ విద్యార్థి పాఠశాలకు చేయూతనివ్వడం అభినందనీయమని హెచ్‌ఎం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్ఞానప్రసాద్, విజయచంద్రిక, సునీత, రాధాకుమారి పాల్గొన్నారు.

ఘనంగా పురుషుల దినోత్సవం



ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కె గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లలిత ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులకు పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో లలిత, భాస్కర్‌రెడ్డి, కనకాచారి, సుల్తాన్, నరసింహారెడ్డి, అరుణ, మరళీధర్, విజయకుమార్, మధుసుదన్, దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బోయకొండ అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండలో చేపట్టదలచిన పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆలయ ఛైర్మన్ నాగరాజురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.3కోట్లతో రణభేరి గంగమ్మ ఆలయం, రూ.7.50కోట్లతో యాత్రికా నివాసం, రూ.10కోట్లతో దేవస్థానం గెస్ట్‌హౌస్, రూ.1.75కోట్లతో నడకమార్గంపై షెల్టర్లు ఏర్పాటు, రూ.1.01కోట్లతో కొండపైన గోశాల వద్ద సిసి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు వివరించారు. మొత్తం రూ.23.26కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఈవో చంద్రమౌళి, కమిటి సభ్యులు భాస్కర్‌రెడ్డి, రాజేష్, ప్రధాన అర్చకుడు గంగిరెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర సంఘం గౌరవ అధ్యక్షునిగా రెడ్డెప్ప

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని దిగువపల్లి పంచాయతీ కొలింపల్లికి చెందిన ఎన్ రెడ్డప్పను జిల్లా వడ్డెర సంఘం గౌరవ అధ్యక్షుడిగా సోమవారం ఆ సంఘ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా తనను ఎన్నుకున్నట్లు రెడ్డప్ప తెలిపారు. వడ్డెర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నప్ప తెలిపారు. సోమవారం గంగవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాఠశాలకు చెందిన చందు, మంజు, పల్లవిలు అత్యుత్తమ ప్రతిభ కనిబరిచారన్నారు. వీరు డిసెంబర్ 28, 29, 30తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

మెలుకువలు పాటిస్తే అధిక దిగుబడులు



ప్రజాశక్తి-యాదమరి: రైతులు సాగు పద్ధతుల్లో మెలుకు వలు పాటిస్తే అధిగ దిగుబడులు సాధిం చవ చ్చని చిత్తూరు జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధి కారి పద్మజ తెలిపారు. సోమవారం మండలంలోని ఓ టివారిపల్లెలో పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసా యంలో ప్రస్తుత ఆధునిక పద్ధతుల గురించి వివరించారు.

భూ కేటాయింపులపై ఎమ్మెల్సీ అభ్యంతరం

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని సాతు రెవెన్యూలోని సర్వే నెం.83/2లో 4ఎకరాల 88సెంట్లు భూమిని ప్రైవేటు అవసరాలకు కేటాయించడంపై ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తప్పుబట్టారు. వెంటనే ఆ భూ కేటాయింపును తిరిగి వెనక్కి తీసుకోవాలని, ప్రజా అవసరాల కోసం వినియోగించాలంటూ తహశీల్దార్‌కు లేఖ రాశారు. అలా లేని పక్షంలో ఆందోళనకు దిగాల్సి ఉంటుందని లేఖలో హెచ్చరించారు. ఆ లేఖను సోమవారం రాళ్లబుదుగూరు యూనిట్ ఇంచార్జ్ ఆర్ఎస్ ముని మండల తహశీల్దార్‌కు అందజేశారు.

వైసిపి నేతలు మా భూమిని కబ్జా చేస్తున్నారు..


- బాధిత రైతుల ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దళిత దంపతులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తమ భూములను వైసిపి నేతలు కబ్జా చేస్తున్నారని బాధిత రైతులు సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. తవణంపల్లి మండల వైసిపి నాయకుడు శేఖర్‌రెడ్డి, అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారని చారాల గ్రామానికి చెందిన బాధిత దళిత రైతు దంపతులు మార్కండేయ, సరసమ్మలు అన్నారు. తమకు ఈచనేరి గ్రామ లెక్క దాఖలాలో గత 80 ఏళ్లుగా వ్యవసాయ భూమి తమ అనుభవంలో ఉందన్నారు. ఈ భూమిలో వేరుశనగ, మామిడి, కొబ్బరి చెట్లు సాగుచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని చెప్పారు. అయితే వైసిపి నాయకులు శేఖర్ రెడ్డి పొలానికి దారి కోసమని తమ భూమిని ఆక్రమించేందుకు యత్నించారని ఆరోపించారు. రాత్రి సమయంలో వచ్చి పెన్సింగ్‌ను తొలగించి, చెట్లను నరికివేసారని చెప్పారు. ప్రశ్నించిన తమపై కులం పేరుతో దూషించారని వాపోయారు. తాము ఎ వైసీపీ పార్టీ కోసమే పనిచేస్తున్నామని, అయితే తమ పార్టీ నాయకులే తమపై దౌర్జన్యం చేయడంతో తమ బాధను ఎవరికీ చెప్పుకోవాలో తెలియడం లేద న్నారు. సిఎం వైఎస్ జగన్, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని విన్నవించారు. తమ కుటుంబానికి ఏమైనా జరిగితే శేఖర్ రెడ్డియే కారణమని కన్నీళ్ళ పర్యంతం అయ్యారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు : వైసిపి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి ఛైర్మన్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తోందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం అ న్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మ ణపల్లిలో 'ఏపికి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సుకుమార్, ఎంపిపి బండి నాగరాణి, మండల పార్టీ కన్వీనర్ పద్మనాభరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు లోకనాథరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సిఎం వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి రావాలని వైసిపి మండల కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. మండలంలోని ఆర్‌కేవిబి పేటలో సోమవారం ఎపికి జగనన్న ఎందుకు కా వాలంటే కార్యక్రమాన్ని సర్పంచ్ దివ్య ఆధ్వర్య ంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామూర్తి, సాయికుమార్‌రెడ్డి, చందురాజు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వైసిపిని ఆదరించి మరోసారి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రరెడ్డి అన్నారు. సో మవారం మండలంలోని కుర్మాయిపల్లె సచి వాలయంలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్య క్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ హేమలత, జెడ్పిటిసి సోమశేఖర్, వైస్ఎంపిపి శిరీష్‌రెడ్డి, నా యకులు కిషోర్‌కుమార్ రెడ్డి, సతీష్‌రెడ్డి, బాబు, ఆనందరెడ్డి, దుర్గాప్రసాద్, గజేంద్ర పాల్గొన్నారు.

వి.కోట: రాష్ట్రంలో జగనన్న ఆధ్వ ర్యంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సం క్షేమ పథకాలు పేద ప్రజలకు వరమని చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బోయచిన్నా గనపల్లిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సులోచనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నారా యణస్వామి, ఎంపీడీవో మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలని ధర్నా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కృష్ణానది జలాల పున: పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న 30 గంటల దీక్షకు సంఘీభావంగా చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికే అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం, ఐదు కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా, ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ ,ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీ చట్టాలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా ప్రజలను దగా చేసిందని త్రివంగా విమర్శించారు. ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలను మోడీ ప్రభుత్వం దగా చేస్తుంటే రాష్ట్రంలో అధికారులు ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు.


బాలల హక్కుల పరిరక్షణకు చట్టాలు



ప్రజాశక్తి-నగరి: బాలల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకోవాల్సిన అవసంరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉందని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం బాల, బాలికల ఎస్టీ హాస్టల్ నందు ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన బాలల దినోత్సవం విశిష్ఠతను వారికి వివరించారు. పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకుగాను ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ బాలల దినోత్సవానికి రూపకల్పన చేసిందన్నారు. ప్రపంచమంతటా పిల్లల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకోసం పలు చర్యలు చేపట్టడం ఈ దినోత్సవం లక్ష్యమన్నారు. బాల కార్మిక చట్టాలు, బాలల హక్కుల చట్టాలను, బాలికల రక్షణకు ఉన్న చట్టాల గురించి తెలియజేశారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే వారు శిక్షార్హులౌతారన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చంద్రకళ, సీనియర్ న్యాయవాదులు మహదేవన్, బాబు, రాము, నాగరాజన్, వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణను అడ్డుకోండి

తహశీల్దార్‌కు గ్రామస్తుల వినతి



ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరులోని ఆర్యవైశ్య, బ్రాహ్మణుల శ్మశాన వాటిక ఆక్రమణను అడ్డుకోవాలని తహశీల్దార్‌కు గ్రామస్తులు విన్నవించారు. సోమవారం తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఏటి పరంబోకు స్థలంలో దహన సంస్కారాలు చేసుకుంటుంటే కమ్మపల్లికి చెందిన రెడ్డెమ్మ అనే మహిళ ఆ స్థలాన్ని ఆక్రమించుకొని అడ్డు పడుతోందని మొరపెట్టుకున్నారు. ఇదివరకే ఈ సమస్యపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేసినట్లు వివరించారు. తక్షణమే ఆక్రమణను అడ్డుకొని న్యాయం చేల్సిందిగా తహశీల్దార్‌ని కోరారు.

చిత్తూరుకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాం

గురజాల జగన్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో చిత్తూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త జిజేఎం ఫౌండేషన్ అధినేత గురిజాల జగన్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం చిత్తూరు జి జి ఎం ఫౌండేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో అపరిస్కృతంగా సమస్యలు తాండవిస్తున్నట్లు గుర్తించగలిగినానని తెలిపారు. ప్రభుత్వాలు మారిన జిల్లా కేంద్రమైన చిత్తూరులో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందని తెలిపారు. చిత్తూరు జిల్లా విభజన అనంతరం జిల్లా కేంద్రంలో ఎలాంటి విద్యాసంస్థలు గాని పారిశ్రామిక వాడలో గాని వైద్యశాలలు గాని లేవని తెలిపారు వీటి సాధన కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు అలాగే జిజేఎం ఫౌండేషన్ ద్వారా యువత మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కషి చేస్తామన్నారు జిల్లా లో ఎదుర్కొంటున్న కరువు సమస్య పరిష్కారం కోసం తాగు సాగు నీటి ఎద్దడి నివారణ కోసం కషి చేస్తానని జిజేఎం ఫౌండేషన్ అధినేత జగన్మోహన్ హామీ ఇచ్చారు అలాగే తాను పుట్టిన జన్మభూమికి తన వంతు అభివద్ధి చేసేందుకు కషి చేస్తామని అభివద్ధి విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి తాను అభ్యర్థిగా ప్రకటిస్తే ఎక్కువ ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుందని పార్టీ ఆదేశమే శిరోదారేమని జగన్మోహన్ వెల్లడించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాల యం ఎదుట మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణాలు, నగరాలు, పరిశుభ్రం చేసి, ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, పరిరక్షిస్తున్న, దళిత, గిరిజన ,బలహీనవర్గాలకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య ,ఇంజనీరింగ్ కార్మికులకు జగనన్న హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, కేంద్ర,రాష్ట్ర, ప్రభుత్వాలు నగరాల సుందరీకరణ, అమృత పట్టణాలు, స్వచ్ఛ భారత్, వంటి ఆకర్షణీయమైన పేర్లు పెట్టి కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయి తప్ప, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను గాలి కొదిలేస్తు న్నాయని, చాలీ చాలని వేతనాలతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదని ముఖ్యమంత్రి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి గోపీనాథ్, గూడూరు సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.వి రమణయ్య పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ మంజూరు.. టిడిపి సంబరాలు



చిత్తూరులో సంబరాలు జరుపుకుంటున్న జగన్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆర్థిక నేరాల కేసులో చంద్రబాబుకు బెయిల్ మంజురు చేస్తూ సోమవారం హైకోర్టు తీర్పు ఇవ్వడంతో టిడిపి నేతలు సంబరాలు చేసుకున్నారు. గురజాల జగన్మోహన్‌నాయుడు నేతృత్వంలో జిజేఎం ఛారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జిజేఎం కార్యాలయంలో చిరు వ్యాపారులకు చేయూతను అందించేలా వంద మందికి తోపుడు బండ్లు పంపిణీ చేయడంతో పాటు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు కోదండయాదవ్, సప్తగిరి ప్రసాద్, సిఎంటి త్యాగరాజ్‌లతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, టిడిపి నాయకులు జిజేఎం ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో టిడిపి శ్రేణులు మండలంలోని తూగుండ్రంలో సంబరాలు జరుపుకున్నారు. నాయకులు నీరజాక్షులురెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నియాజ్ అలీ, జీవరత్నం, శాంతకుమార్, శంకర్, నరసింహులునాయుడు, రాఘవేంద్ర, బాబునాయుడు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలో టిడిపి నాయకులు చంద్రబాబు బెయిల్ రావడంపై సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, హేమచంద్రానాయుడు, లోకనాథనాయుడు, కమల్నాథనాయుడు, వంశి, మంజు, గురుస్వామి, రాధిక, కోదండనాయుడు పాల్గొన్నారు.

నగరి: టిడిపి అధినేత చంద్రబాబుకు రెగ్యూలర్ బెయిల్ లభించడంతో టిడిపి శ్రేణులు నగరిలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, ఖాదర్‌బాయ్, కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, బాలాజి, గుణశేఖర్, అల్లిముత్తు, రాజ, కుమార్ పాల్గొన్నారు.

రామకుప్పం: మండల కేంద్రంలో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. చంద్రబాబుకు రెగ్యూలర్ బెయిల్ రావడం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, కృష్ణనాయక్, మనోహర్, రామకృష్ణప్ప, సుబ్రీ, టీవీ రవి, చంద్రశేఖర్, సలాం సాబ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: స్కిల్ డెవలప్మెంట్ కేసులో సోమవారం చంద్రబాబుకు రెగ్యూలర్ బెయిల్ రావడంతో టిడిపి శ్రేణులు శాంతిపురంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి, మణి, నాగరాజు, చలపతి, రమేష్, రజేంద్ర, జయరాజ్, శ్యామలమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం



గుడుపల్లిలో

ప్రజాశక్తి-గుడుపల్లి: పుస్తక పఠనంలో విద్యార్థులకు విజ్ఞానం పొందొచ్చని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గుడుపల్లిలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రయాన్, తహశీల్దార్ గుర్రప్ప, ఎంపిపి వరలక్ష్మి, జెడ్పిటిసి కృష్ణమూర్తి, వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పుస్తక పఠనంతోనే జ్ఞానం చేకూరుతుందని సర్పంచ్ ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధనంజయరాజు, ఉపాధ్యాయులు సుశీల, లత పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు అధికారులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిపి అనిత, ఎంపిడివో సుధాకర్, తహశీల్దార్ ఇన్బనాథన్, వైస్ ఎంపిపి హరిబాబు పాల్గొన్నారు. వకృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి గజేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరులో

కుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ అధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జింకా లక్ష్మీనారాయణ, నారాయణమూర్తి, ఉపాధ్యాయులు గణేష్, రంగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

నగరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. వివిధ పోటీల్లో విజేతలకు ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామానుజులు, రేవతి, అరుణకుమారి, నవీన్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సోమలలో ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎల్లయ్య, నాగరాజ, గ్రంథాలయ అధికారి రామకృష్ణ, ఉపాధ్యాయులు సురేష్‌బాబు పాల్గొన్నారు.



నగరిలో

ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

- క్వాలిటీ కంట్రోల్ అధికారి ఆనంద్‌రెడ్డి



ప్రజాశక్తి-సోమల: ఉపాధి హామీ పథకం 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణా ళికలు సిద్ధం చేయాలని చిత్తూరు క్వాలిటీ కం ట్రోల్ అధికారి ఆనందరెడ్డి సిబ్బందిని ఆదేశి ంచారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పనులు పూర్తి పారదర్శకంగా జ రగాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎపివో దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ పట్టాలు ఇప్పించాలని వినతి



ప్రజాశక్తి-సదుం: భూమి లేని నిరుపేదలు, దళితులు, ఆదివాసీలకు భూ పంపిణీలో ఒక్కొక్కరికి రెండు ఎకరాల పట్టాలు మంజూరు చేయాలని పలు గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం గాండ్లపల్లి, సజ్జలవారిపల్లి, ఊటుపల్లి, పాలమంద దళిత, ఆదివాసీలు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహశీల్దార్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు సతాపతి మాట్లాడుతూ గాండ్లపల్లి దళితవాడలో 15మందికి, సజ్జలవారిపల్లిలో 21మందికి, ఊటుపల్లిలో 31మందికి, పాలమందలో ఆదివాసీలు 15మందికి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు పలుమార్లు అర్జీలు ఇచ్చామన్నారు. భూ పంపిణీలో పట్టాలు ఇస్తామని జెసి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, వినోద్, గంగురాజు, రాంబాబు, నరసింహులు, చలపతి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించుకుందాం..

-ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి-గుడుపల్లి: రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన చంద్రబాబును గెలిపించుకుందామని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని యామగానపల్లి పంచాయతీలో 'గతం గుర్తు చేసుకుందాం.. బాబు రుణం తీర్చుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గతంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, బాబునాయుడు, బెటప్పనాయుడు, హేమాం బర్‌గౌడ్, సుబ్రమణి, గోవిందస్వామి, అరుణా చలం, రామచంద్ర, ప్రకాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యాసంవత్సరం మొదలై నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందనీ, వెంటనే ఫీజు రియంబర్స్ మెంట్ చెల్లించాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల ఆందోళనలు దష్టిలో ఉంచుకుని తక్షణమే ఫీజులు విడుదల చేయాలని కోరారు. నాలుగేళ్లుగా పీజీ కోర్సుల బకాయిలు రూ.450కోట్లు పెండింగ్లో ఉందనీ, టిడిపి ప్రభుత్వ హయాంలో పీజీ కోర్సులకి ఫీజులు చెల్లించగా, ఈ ప్రభుత్వం వచ్చాక నిలిపేశారని వాపోయారు. విద్యాదీవెన, వసతిదీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, ఈ నాలుగున్నరేళ్లలో ఒక్క ఏడాదీ సకాలంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ చేయలేదని విమర్శించారు. కొత్తగా విద్యా దీవెన డబ్బులను విద్యార్థి, వాళ్ల తల్లి జాయింట్ అక్కౌంటులో వేస్తామంటూ మెలిక పెట్టడం సమంజసం కాదన్నారు.

కిషోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి -రేణిగుంట : కేంద్రీయ విద్యాలయం-2 లో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి స్పష్టం చేశారు. సోమవారం రేణిగుంట సీఆర్ఎస్ వద్దగల కేంద్రీయ విద్యాలయం-2 లో పిఎంశ్రీ పథకం కింద మహిళ శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంరక్షణ శాఖ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ బాలికలు యుక్త వయసులో వచ్చే మార్పులు బాల్యవివాహాల వల్ల అనర్థాలు గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత పోషణ, రుతు స్రావం తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాలికలకు అర్థమయ్యే రీతిలో వివరించారు.

బిసి సమావేశాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: చిత్తూరు పట్టనంలో నిర్వహించబోయే బిసి సమావేశాన్ని విజయవంతం చేయాలని టిడిపి జిల్లా దాసరి సాధికార సమితి అధ్యక్షులు కోలా జయచంద్ర కోరారు. సోమవారం ఆయన వెదురు కుప్పంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం చిత్తూరు పట్టనంలో ఆర్ఆర్ గార్డెన్స్‌లో టిడిపి ఎమ్మెల్సీ గౌనివాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం జరుగనుందన్నారు. బడుగు బలహీన వర్గాలపై వైసిపి చేస్తున్న దాడులను ఖండించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందన్నారు. కార్యక్రమానికి మాజి ఎంపి కృష్ణప్ప, టిడిపి జిల్లా అధ్యక్షులు నాని, జిల్లా నేతలు హాజరవుతారని వివరించారు.

యాదమరి: బిసిల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వినాయక గౌడ్ పిలుపునిచ్చారు.

కుల గణన పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కుల గణన సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపిడివో ప్రేమ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఎంపిడివో కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కేటాయించి పరిధిలో పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. ఓసి, బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాల వారిగా సర్వే చేపట్టాల్సి ఉంటుందని దిశానిర్దేశం చేశారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. సోమవారం రెండవ రోజు పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మూడవ రోజు మంగళవారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటసుబ్బయ్య తెలిపారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఏటి గడ్డిండ్లు, మురారి పల్లెకు చెందిన పలువురు వైసిపి కుటుంబాలు సోమవారం టిడిపిలో చేరారు. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. పార్టీ మారిన వారిలో వార్డ్ సభ్యులు బాబు, మునిరెడ్డి, భానుప్రసాద్, వినోద్‌కుమార్, హరి, గుణశేఖర్, చంద్రశేఖర్, శివసాగర్, సుధాకర్, జనార్ధన్, కుమార్, పవన్, శివకుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-పూతలపట్టు: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొని ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన సోమవారం పూతలపట్టు మండలం తేనేపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక కథనం మేరకు.. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళ్యం మండలం ఉదయమానిఖ్యం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సుధాకర్ పూతలపట్టు మండలం ఎగువ పాలకూర జెడ్పి ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. స్వగ్రామం నుంచి సోమవారం యదావిధిగా పాఠశాలకు వస్తున్న ఉపాధ్యాయుడిని తేనేపల్లి తాటితోపు వద్ద ఆటో ఢీకొనింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.